ప్రజాశక్తి
మంగళవారం 22 నవంబర్ 2022

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్యలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఏ అరియర్స్, సరెండర్ లీవ్‌లు, గ్రాట్యూటీ, కమ్యూటేషన్ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పర్యాటకానికి ప్రోత్సాహం.. అందేనా..?

పెనుకొండ కోట ప్రాంతం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలున్నాయి. దేశ, విదేశాల నుంచి కూడా జిల్లాకు పర్యాటకులు అధికంగా వస్తుంటారు. కాగ కోవిడ్ నుంచి పర్యాటక రంగం పూర్తిగా కుదేలైంది. గతేడాది నుంచి తిరిగి పర్యాటక రంగం కొంత కొలుకుంటూ ఉంది. వస్తున్న సందర్శకుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పుట్టపర్తి, పెనుకొండ, గుత్తి, హేమావతి, తిమ్మమ్మమర్రిమాను ఇలా అనేక పర్యాటక ప్రాంతాలున్నాయి. ఏటా సుమారు ఐదు లక్షల మంది వరకు జిల్లాకు పర్యాటకులు వస్తున్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇందుకు తగ్గట్టు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెనుకొండ కొండపైకి రహదారి, అక్కడ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం నిర్మాణం చేపడతామని గతంలో ప్రకటించారు. అయితే అది ఇంత వరకు ఆచరణకు నోచుకోలేని పరిస్థితులున్నాయి. లేపాక్షిలోనూ మౌలిక సదుపాయల కల్పన మరింత మెరుగుపరచాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. వచ్చే పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పుట్టపర్తిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతామని గత ప్రభుత్వ హామీనిచ్చింది. అయితే చిత్రావతి నదిలో బోటు షికారు మినహా తక్కిన చర్యలేవి తీసుకున్న దాఖలాల్లేవు. గిన్నిస్ బుక్ ఆప్ రికార్డుల్లో ఎక్కిన అతిపెద్ద మర్రి చెట్టు అయిన తిమ్మమ్మ మర్రిమాను పూర్తి స్థాయి రక్షణ చర్యలేవి లేవు. ఒకవైపు కొమ్మలు పడిపోతున్నాయి. మరోవైపు అక్కడికొచ్చే భక్తులకు కనీస సౌకర్యాలూ లేవు. కర్నాటక తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి పెద్దఎత్తునే తరలివస్తుంటారు. వీటిని మెరుగుపరచాల్సి అవసరముంది. అనంతపురం జిల్లాలో గుత్తి కోటలో గుప్త నిధుల తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిని నిలువరించే చర్యల్లేవు.

◆ ఆగిన లేపాక్షి, పెనుకొండ ఉత్సవాలు
◆ నేడు పర్యాటక శాఖ మంత్రి రోజా రాక

నేడు పర్యాటకశాఖ మంత్రి జిల్లా పర్యటన

పర్యాటక శాఖ మంత్రి రోజా నేడు సత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు లేపాక్షికి చేరుకుంటారు. లేపాక్షి సందర్శన అనంతరం రోడ్డు మార్గంలో పుట్టపర్తికి చేరుకుంటారు. అక్కడ సాయంత్రం 7.30 గంటలకు హిల్ వ్యూ స్టేడియంలో విద్యుత్‌దీపాలు, సౌండ్‌షోను ప్రారంభిస్తారు. అనంతరం యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ యాదవ్ ఇంట్లో భోజనం చేసుకుని తిరిగి రాత్రి 9.30 గంటలకు రైలులో హైదరాబాద్ బయలుదేరి వెలుతారు.

అటకెక్కిన లేపాక్షి, శ్రీకృష్ణదేవరాయ ఉత్సవాలు

జిల్లాలో 2010 నుంచి జిల్లాలో శ్రీ కృష్ణదేవరాయ ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఉత్సవాల నిర్వహణ ద్వారా ఈ ప్రాంతంలోని ప్రాచీన చరిత్రను తెలియజేసే ప్రయత్నం జరుగుతూ వచ్చింది. ఆ తరువాత లేపాక్షి ఉత్సవాలను నిర్వహించారు. అయితే గడిచిన మూడేళ్లుగా ఈఉత్సవాల నిర్వహణ ఆగిపోయాయి.

దళితుల రక్షణకు ఐక్య ఉద్యమాలు

◆ కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప ◆ మడకశిరలో విజయవంతంగా జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఐక్య ఉద్యమాలతో తిప్పికొట్టాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) ప్రథమ జిల్లా మహాసభలు మడకశిర పట్టణంలో సోమవారం నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి యాదవకల్యాణ మండపం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం యాదవకళ్యాణ మండపంలో మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నల్లప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల దళితులు, గిరిజనులపై దాడులు అధికం అయ్యాయన్నారు. ఒక్క సెంటు కూడా భూమిలేని దళితులు, గిరిజనులు ఎంతో మంది ఉన్నారన్నారు. వీరిని ఆదుకునే దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. దళితుల సంక్షేమానికి తూట్లు పొడిచి 20కిపైగా పథకాలను కుదించి, నిధులను దారి మళ్లించిందన్నారు. విద్య, ఉపాధి లేకుండా మోసాం చేస్తోందన్నారు. పథకాలన్నింటిలోనూ కోత విధిస్తోందన్నారు. దళితులకు ఉన్న ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్ ఆనంద్ మాట్లాడుతూ దళిత, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

మహాసభల్లో ప్రసంగిస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప

వెట్టిచాకిరీ కార్మికులకు గుర్తింపు కార్డులు అందించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం కెవిపిఎస్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

కెవిపిఎస్ నూతన కమిటీ ఎన్నిక

కెవిపిఎస్ జిల్లా మహాసభల సందర్భంగా ఆ సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా ఎంవి.రమణ, అధ్యక్షుడిగా హనుమయ్య, ఉపాధ్యక్షులుగా పెద్దన్న, జ్యోతమ్మ, కెవి.రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా నరసింహ, గంగాధర్, వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులుగా సుధాకర్, యోగానంద, తిమ్మయ్య, రాముమూర్తి, మధు, నారాయణప్ప, అంజినప్ప, రాయుడు, నరసమ్మ, గంగప్పతో పాటు 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్యం

కలెక్టర్ బసంత్ కుమార్

కలెక్టర్ చేతుల మీదుగా సత్కారాలు అందుకున్న జిల్లాకు చెందిన వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. "ఫ్యామిలీ డాక్టర్ విధానం" అమల్లోకి వచ్చిన ఏడాది పూర్తి అయిన నేపథ్యంలో జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అత్యంత ప్రతిభ కనబరచిన వైద్యులకు అభినందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీకాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలదించిన తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మున్వర్ బాషా, డాక్టర్ విటి.రోజా తదితరులను కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్థానికంగా పేద ప్రజలు రవాణా ఖర్చులు లేకుండా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యం అందుకోగలుగుతున్నారని తెలిపారు. ఇంటిముంగిటకు వైద్యం రావడంతో నిరుపేద రోగుల్లో ఆత్మవిశ్వాసం కలుగుతున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మన రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం సేవలందించిన వైద్యుల స్ఫూర్తితో ఇతర వైద్యులు కూడా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని కొనసాగించి సత్ఫలితాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ , ఇన్‌ఛార్జి డిఆర్ఒ భాగ్యరేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥ఎస్‌వి.కష్టారెడ్డి, డిసిహెచ్ఎస్ డా॥తిప్పేంద్రనాయక్, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు రామ్మోహన్, కదిరి తాలూకా ఎన్జీవో అధ్యక్షులు వేణుగోపాల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

పుట్టపర్తి కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ బసంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ భాగ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్, పంచాయతీ రాజ్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, డిఇఒ మీనాక్షి, డ్వామా పీడీ రామాంజనేయులు, చేనేత జౌళి శాఖ ఏడీ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏం తిని బతకమంటారు..?

కలెక్టరేట్ వద్ద నిరసనలో స్వచ్ఛభారత్ కార్మికులు

కలెక్టరేట్ ముందు ప్లేట్లలో పచ్చి గడ్డి పెట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి.పుట్టపర్తి అర్బన్

నెలల కొద్దీ వేతనాలు ఇవ్వకుంటే ఏం తిని బతకమంటారు.. ? ఎలా పనిచేయమంటారని స్వచ్ఛభారత్ పారిశుద్ధ్య కార్మికులు ప్రశ్నించారు. ఈ మేరకు వారు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు ప్లేట్లలో గడ్డి, ఆకులు పెట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, జిల్లా స్వచ్ఛభారత్ పంచాయతీ ఫెడరేషన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మూడు నెలల క్రితం ఇక్కడే పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళన చేస్తే వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. మూడు నెలల నుంచి మూడేళ్ల వరకు పలు పంచాయతీలలోని కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గట్టిగా వేతనాలు అడిగితే సర్పంచులు, అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఇష్టం ఉంటే పనిచేయండి లేకుంటే మానేయండి అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్‌కు డిపిఒ విజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డిపిఒ మాట్లాడుతూ తొందరలోనే పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని రాజకీయ ఒత్తిడితో ఎవరిని తొలగించే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన స్వచ్ఛభారత్, పంచాయతీల కార్మికులతో పాటు సిఐటియు నాయకులు గౌస్ లాజం, గంగాధర్, ఆది, అక్కులప్ప, గోవిందు, నాగరాజు, ఈశ్వరమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రహదారిని కప్పేసిన ముళ్లపొదలు

ప్రజాశక్తి బుక్కపట్నం

కొత్తచెరువు బుక్కపట్నం ప్రధాన రహదారి నాలుగు కిలోమీటర్ల మేర చెరువు కట్ట పైన ఇరువైపులా ముళ్ల పొదలు, కంపచెట్లు పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ ప్రధాన రహదారిపై కొత్తచెరువు నుంచి బుక్కపట్నం మీదుగా ముదిగుబ్బ, కదిరి, పులివెందులకు భారీ వాహనాలతో పాటు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే నడిమి కొండ నుంచి, బుక్కపట్నం చెరువుతూము వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు, ముళ్ల పొదలు పెరిగి రోడ్డుపైకి రావడంతో ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సత్య సాయి జన్మదిన సందర్భంగా ఈ రహదారిపై వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కలుగజేసుకొని కంపచెట్లను, ముళ్ల పొదలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రహదారి చుట్టూ అల్లుకుపోయిన ముళ్లపొదలు

ఇంటర్ విద్యార్థులకు అందని పాఠ్య పుస్తకాలు

అయోమయంలో బోధన

ప్రజాశక్తి - చిలమత్తూరు

పాఠ్య పుస్తకాలు అందక ఇంటర్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమై 4 నెలలు కావస్తున్నా ఇంతవరకుఉచిత పాఠ్య పుస్తకాలు అందలేదు. చిలమత్తూరు మండల పరిధిలో డీవీఅండ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరంలో వివిధ గ్రూపులలో 213 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో తెలుగు, ఇంగ్లీషు మీడియంకు చెందిన సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. వీరు పాఠ్య పుస్తకాలు కొనుక్కుందామంటే బుక్ స్టాల్ లో అందుబాటులో లేవు. ఒకటి రెండు చోట్లు ఉన్నా అధిక ధరలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో అధికశాతంమంది విద్యార్థులు ఫెయిల్ కావడంతో ఈ సారి మొదటి సంవత్సరం విద్యార్థులకు పాత పుస్తకాలు సైతం సమకూర్చలేని పరిస్థితి నెలకొందని అధ్యాపకులు చెబుతున్నారు. ఇక పాఠ్య పుస్తకాలు లేకుంటే పాఠ్యాంశాలు బోధించినా విద్యార్థులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. రాష్ట్రప్రభుత్వం ఇంటర్ విద్యపై నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శిస్తున్నారు. వెంటనే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఎస్ ఎఫ్ ఐ మండల కార్యదర్శి జగదీష్, అధ్యక్షుడు రాకేష్ హెచ్చరించారు.

జాతీయస్థాయి శిబిరానికి ధర్మవరం డిగ్రీ కళాశాల విద్యార్థి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కాహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.ఎస్ చరణ్‌సాయి యాన్యువల్ హాగ్ షిప్ ప్రోగ్రాం అప్‌గ్రేడ్ రోప్ అనే సదస్సుకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సోమవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ చతీష్‌ఘడ్‌లో ఈనెల 23 నుంచి డిసెంబర్ 10వతేదీ వరకు సదస్సు జరుగుతుందన్నారు. ఈసదస్సులో చరణ్‌సాయి పాల్గొంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జీవనకుమార్, అధ్యాపకులు రాబియాబేగం, చిట్టెమ్మ, సమీవుల్లా, శివప్రసాద్, పావని, కస్వామి పుష్పావతి, గౌతమి పాల్గొన్నారు.

గుడిబండ కొండలో చిరుత సంచారం భయాందోళనలో గ్రామస్తులు

గుడిబండ : గుడిబండ కొండలో గత కొన్ని రోజులుగా చిరుత పులి సంచరిస్తుండంతో దానిని చూసిన గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ కొండ దాదాపు 90 ఎకరాల్లో విస్తరించి ఉంది. పెద్ద పెద్ద గుహలు, చెట్లు ఉన్నాయి. దీంతో చుట్టుపక్కల ఫారెస్ట్ ప్రాంతం నుంచి ఎలుగుబంట్లు, చిరుతలు ఈ కొండల్లో స్థావరాన్ని ఏర్పరచుకున్నాయి. ఇటీవల చిరుతపులులు కొండ చుట్టూ ప్రక్కల ఇళ్ల ముందుఉన్న గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవు దూడలపై దాడులు చేశాయి. కొన్నింటిని ఎత్తుకెళ్లాయనిగ్రామస్తులు వాపోతున్నారు. అదేవిధంగా ఎలుగుబంట్లు వడ్రహట్టి, గొల్ల హట్టి కాలనీల్లో సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నాయి. ఈ విషయంపై సంబంధిత ఫారెస్టు అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన ప్రయోజనం కన్పించలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొండగుహల్లో స్థావరాలు ఏర్పరచుకున్న చిరుతపులి, ఎలుగుబంట్లు గ్రామాల్లో ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైసిపి పేదల కడుపుకొడితే..టిడిపి కడుపు నింపుతోంది..

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదవాడి కడుపు కొడితే.. టిడిపి పేదల కడుపు నింపుతోందని టిడిపి నాయకులు అన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు స్థానిక బస్టాండ్ ఎదుట శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం శిబిరంలో 36వ వార్డు టిడిపి నాయకుడు లోమడ గోపాల సహకారంతో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడిందన్నారు. పేదవాడికి అందనంత ఎత్తులో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. ధరలను అదుపు చేయడానికి ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ వ్యవస్థను వైసిపి పూర్తిస్థాయిలో కనుమరుగు చేసిందని మండిపడ్డారు. అంతేకాకుండా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారాయన్నారు. దెబ్బతిన్న రోడ్లకు గంపెడు సిమెంట్, కంకర వేయలేని రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజవానులు కడతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈసమయంలో సార్వత్రిక ఎన్నికల కోసం అన్నివర్గాల ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు. ఈసారి తప్పకుండా టిడిపి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పునేశనపల్లి సర్పంచి త్యాలప్పనాయుడు, టిడిపి నాయకులు పురుషోత్తంగాడ్, పరిశే సుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మారుతీస్వామి, చీమల రామాంజి, దిగినెర్ల రాఘవరెడ్డి, రామకృష్ణ, అండన్న, మిడితల యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి-బత్తలపల్లి



గంటాపురంలో మహిళలతో చర్చిస్తున్న విదేశీ బృందం ప్రతినిధులు

మహిళా సంఘాల పనితీరును విదేశీ బందం ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని గంటాపురం గ్రామంలోని అక్షర గ్రామసంఘం, బత్తలపల్లిలోని భారతి మండల సమాఖ్య కార్యాలయంలో సందర్శించారు. జీడబ్ల్యూఎస్ (జర్మనీలోని ఓ ఆర్గనైజింగ్ సంస్థ) టీమ్ దీను(యుఎస్), సౌమిక్ (లండన్), కస్తూరి (పశ్చిమబెంగాల్), మంజుల(చత్తీస్మఢ్) తదితరులు డిపిఎం లక్ష్మానాయక్‌తో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలను ఏ విధంగా ఏర్పాటు చేస్తారు, సంఘాల ద్వారా కుటుంబాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయి, ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు, సమస్యలు వచ్చినప్పుడు ఏ విధంగా ఎదుర్కొంటున్నారనే విషయాలను గ్రామసంఘం కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఉషారాణి, పార్వతి, అమృత, నాగేంద్రమ్మతో చర్చించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వైఎస్ఎస్ సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, ఆర్ఎస్ఎస్ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సెర్ప్ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి. బీడబ్ల్యూఎస్ టీమ్ ఏఓ ప్రవీణ్, జిల్లా కోర్డినేటర్ సుమతి, ఎంటిఎస్ సుకన్య, రామ్మోహన్‌రెడ్డి, ఎపిఎం సుదర్శన్‌రాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతి

రొద్దం : మండలంలోని కంబాలపల్లిలో సోమవారం కనకదాసు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మతో పాటు పలువురు కురుబలు పాల్గొన్నారు.

మడకశిర సిఐగా సురేష్ బాబు

మడకశిర : మడకశిర సిఐగా సురేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్క పనిచేస్తున్న నాగార్జునరావు విఆర్‌కు వెళ్లిన నేపథ్యంలో అనంతపురం విఆర్ లో ఉన్న సురేష్ బాబును మడకశిర సిఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మడకశిర సర్కిల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఓబుల దేవర చెరువు : స్వచ్ఛభారత్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు స్వచ్ఛభారత్ కార్మికులు, పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించి ఎంపిడిఒ పోలప్పకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజినప్ప, శ్రావణి, నిర్మలమ్మ, ఓబులమ్మ భాగ్యమ్మ, లక్ష్మీదేవి, గంగన్న, ఆది, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు అధికారులు కరువు

సోమందేపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి స్పందన కరువైంది. పలువురు అధికారులు హాజరు కాకపోవడంతో పలు సమస్యలతో అధికారులకు అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగి వెళ్లారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమానికి అధికారులు హాజరు కాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తహశీల్దార్‌తో పాటు రెండు మూడు శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. అధికారులే స్పందన కార్యక్రమానికి రాకపోతే స్పందన అర్జీలకు పరిష్కారం ఎలా జరుగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల మండల అధికారులు హాజరయ్యే విధంగా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ధనాపురం విద్యార్థులు

పరిగి : ఇటీవల హిందూపురంలోని ఎంజీఎం పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన బాల్ బాడ్మింటన్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన మండలంలోని ధనాపురం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పిడి మహేష్ దీపక్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ క్రీడా పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు.

అర్హులైన రైతులందరికీ రాయితీ వేరుశనగ

మడకశిర : బోరు బావుల కింద వేరుశనగ సాగు చేసే అర్హులైన రైతులందరికీ సబ్సిడీ వేరుశనగను ప్రభుత్వం అందజేస్తోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కవిత సత్యనారాయణ సూచించారు. రబీలో బోరుబావుల కింద సాగు చేసేటటువంటి రైతులకు విత్తన వేరుశనగ కాయలను ఎంపీపీ కవిత సత్యనారాయణ సోమవారంపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ వీర నరేష్, వండకెడ్డె గ్రామ సర్పంచ్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మెన్ హనుమంత రెడ్డి, రైతు భరోసా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

అమడగూరు : మండల పరిధిలోని మహమ్మదాబాదు పి.మస్తాన్ రెడ్డి మెమోరియల్ ట్రస్టు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను సోమవారం పంపిణీ చేసింది. పి.మస్తాన్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మస్తాన్ రెడ్డి కుటుంబ సభ్యులు 190 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అంజనేయులు, మస్తాన్ రెడ్డి కుటుంబ సభ్యులు నాగార్జున రెడ్డి, వివేకానంద రెడ్డి, కమల్ నరేంద్ర, రేఖతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

తలుపుల : మేజర్ పంచాయతీ పరిధిలోని కుమ్మరపేటకు చెందిన శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ తనవంతు ఆర్థికసాయం అందజేశారు. ఉపసర్పంచి డికె బాబు సోమవారం బాధితుడికి రూ.10వేలు అందజేశారు.

సత్యసాయి జయంతికి పటిష్ట భద్రత

పుట్టపర్తి రూరల్ : సత్య సాయి బాబా జయంతి సందర్భంగా గట్టి భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. జయంతి వేడుకలకుదేశ విదేశాల నుండి వచ్చు సత్యసాయిబాబా భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ వేడుకలకు ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. బందోబస్తులో ఇద్దరు డిఎస్పిలు, 12 మంది సిఐలు, 50 మంది ఎస్ఐలు, 90 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 250 మంది కానిస్టేబుళ్లు, 30 మంది మహిళా కానిస్టేబుళ్లు, 80 మంది హోంగార్డులు, నాలుగు స్పెషల్ పార్టీ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సాదాసీదాగా మండలమీట్

తనకల్లు : స్థానికమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది, ఎంపిపి వీరకొసల్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పూల నరసింహులు, ఈవోఆర్డీ ఆనందయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని యువతకు ఉపాధి కల్పించాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ బసంత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు పామిశెట్టి బాలాజీ, ప్రధాన కార్యదర్శి పై శ్రీనివాసులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు అంబులెన్స్ రమేష్, నరేష్ యాదవ్, విజయ్ చౌదరి, గంగులయ్య, మంజునాథ్, ఆంజనేయులు, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రెండో విడత ఆధార్ ప్రత్యేక క్యాంపు

పుట్టపర్తి అర్బన్ : రెండవ విడత ఆధార్ కార్డు నమోదు కార్యక్రమం ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు, సచివాలయాల్లో ప్రజలు ఆధార్ కోసం మూడు రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆధార్ కార్డు లేని వారు కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సచివాలయాల తనిఖీ

బత్తలపల్లి : మండలంలోని బత్తలపల్లి-1, 2వ గ్రామ సచివాలయాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్) రాజశేఖర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండలంలో జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను పరిశీలించారు. సర్వే ఎంత వరకు చేశారనే వివరాలను పరిశీలించి, ఏఎన్ఎంలతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు కవిత, రాధ, శ్రీలత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కిన కాలనీవాసులు

కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి మడకశిర

తమ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగర పంచాయతీ పరిధిలోని నాగన్నబండ, సిసి కుంట, శంకర్, లింగన్న బండ కాలనీలకు చెందిన మహిళలు రోడ్డుపై సోమవారం బైటాయించారు. గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో శాసనసభ్యుడు తిప్పేస్వామి కాలనీ సమీపంలోని మారుతి నగర్‌కు వస్తున్నారన్న సమాచారం అందుకున్న కాలనీవాసులు, మహిళలు రోడ్డుకు అడ్డంగా ముళ్ళకంపలను వేసి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ కాలనీకి దూరంగా ఉన్న ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించుకుని వెళ్లిపోయాడు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మంజమ్మ, అరుణ, సరోజమ్మ, ఈరమ్మ, అనిత, గంగమ్మ, చాంద్‌బీ తదితరులు మాట్లాడుతూ తమ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని వాపోయారు. కాలనీలో సిమెంటు రోడ్లు నేటికీ ఏర్పాటు చేయలేదన్నారు. దీనికి తోడు తమ కాలనీకి సమీపంలో సివిల్‌సప్లయ్ గోడౌన్ ఉండటంతో నిత్యం లారీల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. ఈ లారీల వల్ల తాగునీటి సరఫరా కోసం ఏర్పాటుచేసిన పైపులైన్లు పగిలిపోయి నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామన్నారు. అంతేకాకుండా వీధి దీపాలు సైతం వెలగడం లేదన్నారు. కాలనీని అటవీ ప్రాంతానికి, పంట పొలాలకు అత్యంత సమీపంలో ఉంటుండడంతో రాత్రుల్లో ఎలుగుబంట్లు సంచారం అధికంగా ఉంటుందన్నారు. పాలకులు, అధికారులు తమ కాలనీ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, వార్డు కౌన్సిలర్ నిరసన కారులతో మాట్లాడారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో మహిళలు నిరసనను విరమించారు..

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

కర్నాటక రాష్ట్రం మైసూరులోని మహారాజ ఇండోర్ హాల్‌లో ఆదివారం జరిగిన ఐదవ జాతీయ స్థాయి కరాటే పోటీలల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. కరాటే మాస్టార్ ఫైరోజ్ నిర్వహిస్తున్న సెన్సెయి కరాటే శిక్షణ కేంద్రం నుంచి 10 మంది విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు మస్టార్ ఫైరోజ్ తెలిపారు.కిషోర్, ధనుష్, గ్రీష్మ, నేహ, అమృత, వర్షిణి, శైలజ, అబ్దుల్ సైఫ్, అయాన్, యాస్మీన్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారన్నారు. వీరందరికి నిర్వహకులు మొమెంటో, సర్టిఫికెట్‌లను అందించినట్లు ఫైరోజ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రామాపురం విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి-బత్తలపల్లి

ధర్మవరంలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 బాలికల బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి అనంతపురం జిల్లాస్థాయి పోటీల్లో రామాపురం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈపోటీల్లో ధర్మవరం నియోజకవర్గం జట్టు విజేతగా నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ విజయంలో రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కె.మౌనిక, కె.అనిత విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, పీడీ లక్ష్మీనారాయణ, స్థానిక వైసిపి నాయకులు వీరనారప్ప, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

బాధితులకు అండగా ఉంటాం : టిడిపి

ప్రజాశక్తి కదిరి టౌన్

నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, తదితరులు

వైసిపి రౌడీ మూకల దాడిలో ఇల్లు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కందికుంట వెంకటప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కందికుంట సోమవారం బాధితులను పరామర్శించారు. వైసిపికి చెందిన 11వ వార్డు కౌన్సిలర్ భర్త నూరుల్లా, ఇసాక్ బరితెగించి అర్ధరాత్రి పేదల ఇల్లు కూల్చి వేయడంతో అన్యాయమని ఆయన అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అనంతపురం చెన్నై రహదారి జీమాన్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు కష్టపడి సంపాదించిన డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలానికి డబ్బులు చెల్లించాలని వైసిపి రౌడీ మూకలు బెదిరించడం తగదని అన్నారు. డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వనందున ఇళ్లను రాత్రి పూట దౌర్జన్యంగా కూల్చివేయడం అన్యాయమని అన్నారు. ముస్లిం పక్షపాతి అని చెప్పుకుంటున్న స్థానిక ప్రజాప్రతినిధి జరిగిన ఈ సంఘటనపై స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కపట్నం మండలంలో గ్రామస్తులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రొద్దం మండలంలో గ్రామస్తులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఓబులదేవరచెరువు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సున్నంపల్లి సచివాలయం పరిధిలో గల మాహ్మదాబాద్ క్రాస్‌లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పర్వీన్‌భానుర, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచులు గోవిందు, రామచంద్రారెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని మారుతినగర్‌లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వార్డులోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని రంగే గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, నాగేంద్ర, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వాలెంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : వైసిపి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమవుతుందని పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పాముదుర్తి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, సర్పంచి గోవిందరెడ్డి , కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి , సుజాత, చిరంజీవి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని సోమవారం నల్లూరు గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ దృష్టికి గ్రామస్తులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని వాపోయారు. గ్రామంలో వేసిన వీధిలైట్ల నుంచి వెలుతురు రావటం లేదని చెప్పారు. అదేవిధంగా దళిత కాలనీలో ఉన్న పాఠశాలలో పూడికకు మట్టితోలాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంపిపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ, స్థానిక సర్పంచితో పాటు పలువురు నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తలుపుల : ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టో 95 శాతం హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఓబుళరెడ్డి పల్లి గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, తలుపుల ఉప సర్పంచి డీకే బాబు, సర్పంచులు మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామానికి రహదారి లేకుండా చేస్తున్నారని ఆందోళన

ప్రజాశక్తి.పుట్టపర్తి అర్బన్

ఆందోళన చేస్తున్న వీరంపల్లివాసులు

హిందూపురం మండలం గుడికి పంచాయతీలోని బీరంపల్లికి రహదారి లేకుండా మూసి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు ఆందోళనకు దిగారు. తమ గ్రామానికి రహదారి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు మాట్లాడుతూ పూర్వం నుంచి తమ గ్రామానికి ఉన్న రహదారిని తహశీల్దార్ మరో వ్యక్తికి పట్టా ఇచ్చాడన్నారు. ఆ వ్యక్తి రహదారిని మూసివేస్తూ ఇల్లు కడుతున్నాడన్నారు. రహదారి లేకుంటే తాము ఎలా రాకపోకలు సాగించాలని ప్రశ్నించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆనంద రెడ్డి, గంగాధర్, రామచంద్రప్ప, మారుతి, శాంతానంద్, చౌడప్ప, రమేష్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఈ-నామ్‌ను వంద శాతం అమలు చేస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డ్ కార్యదర్శి

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో వంద శాతం ఈ-నామ్‌ను అమలు చేస్తామని వ్యవసాయ మార్కెట్ యార్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన ఈ-నామ్...బద్నామ్ అనే కథనానికి ఆయన స్పందించారు. వెంటనే సిబ్బందితో సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు మార్కెట్ యార్డులో ఈ-నామ్ విధానంలో కాకుండా బహిరంగ వేలం విధానంలో వ్యాపారాలు చేస్తున్న కమిషన్ ఏజెంట్, వ్యాపారికి నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకుని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై వంద శాతం ఈ-నామ్ విధానంలో వ్యాపారాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మండలంలో 'బికె' పాదయాత్ర

రొద్దం : మండలంలో దొడగట్ట నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు బికె పార్థసారధి ఆధ్వర్యంలో రైతు కోసం తెలుగుదేశం పార్టీ పాదయాత్రను మంగళవారం చేపడుతున్నట్లు మండల కన్వీనర్ నరహరి తెలపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

తనకల్లు : మండల పరిధిలోని మండ్లి పల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు సామల జయరామిరెడ్డి (60) ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, కుంచె నాగేంద్ర ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.

ఆటోనగర్, డ్రైవర్స్‌కాలనీ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో అభివృద్ధికి నోచుకోని ఆటోనగర్, డ్రైవర్స్ కాలనీలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘ పరధిలోని 13వ వార్డు పరిధిలోని ఆటోనగర్, డ్రైవర్స్ కాలనీల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు సునీత వెంకటేశ్వరరెడ్డి, ముస్తక్, మల్లికార్జున, కో- ఆప్షన్ సభ్యులు రహమాత్, ఎంపీటీసీ బసవనపల్లి ధనుంజయ రెడ్డి, వైసిపి నాయకులు సోమశేఖర్‌రెడ్డి, లతీఫ్‌సేఠ్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల విక్రయానికి వేలంపాట

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలోని చిల్లవారిపల్లి కాటికోటేశ్వరస్వామి దేవస్థానంలో టెంకాయలు, బొమ్మల విక్రయానికి, తలనీలాలకు దేవస్థానం అధికారులు సోమవారం వేలంపాట నిర్వహించారు. ఈవేలంపాటలో టెంకాయలు విక్రయించుకునేందుకు జె.సాంబశివుడు రూ.3.72లక్షలకు దక్కించుకున్నాడు. అదే విధంగా తలనీలాలకు మారన్న రూ.1.13లక్షలకు దక్కించుకున్నాడు. గాజులు, బొమ్మలు విక్రయించుకునేందుకు పి.శివారెడ్డి రూ.42వేలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిల్లవారిపల్లె గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

టన్ను ప్లాస్టిక్ వస్తువులు పట్టివేత

కదిరి టౌన్ : మున్సిపల్ పరిధిలోని రాయచోటి రోడ్డు లోని ఓ గోడౌన్ లో పెద్ద ఎత్తున నిషేధిత ప్లాస్టిక్‌ను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వస్తువులు నిల్వ ఉంచారన్న సమాచారంతో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ సివి రమణ తన సిబ్బందితో గోడౌన్‌పై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకునాన్నరు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు మాట్లాడుతూ దాదాపు ఒక టన్ను బరువు గల ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ సుమారు రూ. 50 వేలు పైనే ఉంటుందని చెప్పారు. గోడౌన్ యజమానికి రూ. 2వేలు జరిమానా విధించిన్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నల్లమాడ : మండలం లోని రెడ్డిపల్లి రామాపురం గ్రామానికి చెందిన బోయ హరిప్రసాద్ (35) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కొత్తచెరువు : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన మండలకేంద్రానికి చెందిన రమేష్ బాబును టిడిపి నాయకులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన రమేష్ బాబు రెండు కిడ్నీలు పాడవ్వడంతో కొత్తచెరువులోనివారి మేనమామ గంగాధర్ ఇంటిలో ఉంటూ చికిత్సలు పొందుతున్నారు ఈనేపథ్యంలో చెర్లో కమ్మవారి పల్లి కి చెందిన ఊరి వాకిలి సురేష్ నాయుడు బాధితుడిని పరామర్శించి రూ. 7వేలను అందజేశారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఫోన్‌లో బాధితుడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, బండ్లపల్లి రాజు, వెంకటరాముడు, అంబులెన్స్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

లేపాక్షి : మండల కేంద్రంలో నిబంధనలు పాటించకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని స్థానిక వైద్యాధికారి చిరంజీవి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం మండలకేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవటానికి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

మడకశిర : మడకశిర వృత్తి విద్య కళాశాలలో చదువుకున్న వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో మృతుని కుటుంబానికి వృత్తివిద్య కళాశాల నిర్వాహకులు ఆర్థికసాయం అందజేశారు. ఈ నేపథ్యంలో మృతుడు హరీష్ తల్లిదండ్రులకు కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. హరీష్ వైద్యచికిత్స కోసం ఆ కుటుంబసభ్యులు దాదాపు రూ.3లక్షలు అప్పు చేశారు. విషయం తెలుసుకున్న కళాశాల కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు కలసి మృతుని కుటుంబానికి రూ.30వేలను ఆఅందజేశారు.

దాతలకు సన్మానం

దాతలను సన్మానిస్తున్న నాయకులు

గోరంట్ల : మృతదేహాలను నిల్వ చేయడానికి డీఫ్రిడ్జ్ ల ఏర్పాటుకు అవసరమైన నగదును అందజేసిన దాతలను స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. దాతలు బాలన్న గారి పల్లికి చెందిన పోతుల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను, గోరంట్ల పట్టణానికి చెందిన ఎంవీ నాగరాజు కుటుంబ సభ్యులను సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అడిగిన వెంటనే లక్షలాది రూపాయల విలువజేసే డీఫ్రిజ్‌ల ఏర్పాటుకు సహరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సరోజానాగేనాయక్, జెడ్పీటీసీ జడ్పిటిసి జయరాం నాయక్, మాజీ జెడ్పీటీసీ వెంకట్ రెడ్డి సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, వార్డు మెంబర్ రంగారెడ్డి, సర్పంచులు గంగప్ప, వెంకటరమణ, రామాంజనేయులు, శివశంకర్ రెడ్డి, కార్యదర్శి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు

మడకశిర : పౌష్టికాహారం పక్కదోవ పట్టిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకోంటామనిఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హెచ్చరించారు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మడకశిర ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉయ్యాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిరేఖ, శ్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు నాగమల్లేశ్వరి, ఎంపీపీ కవితా సత్యనారాయణ, జెడ్పీటీసీ సరోజమ్మ నర్సింహమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర, ఆస్పత్రి సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెనరాబ్యాంకు చేయూత

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంకు 117వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులకు సోమవారం చేయూతనందించారు. విద్యాజ్యోతి పథకం ద్వారా పాఠశాలలో ప్రతిక కనబరిచిన 5వ తరగతి ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.2500, 8, 9, 10వ తరగతి విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది హారిక, హరినాథ్‌రెడ్డి, మారుతి, గోపీ, పాఠశాల హెచ్‌ఎం మేరీ, ఉపాధ్యాయులు శారద, కర్త పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సాయం

బత్తలపల్లి : మండలంలోని మాల్యవంతం గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సోమవారం ఆర్థికసాయం చేశారు. ఎస్సీ జనసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహానికి రూ.20వేల నగదు అందజేశారు.

'స్పందన'కు గైర్హాజరైతే చర్యలు

బత్తలపల్లి : మండల కేంద్రంతోపాటు, గ్రామ సచివాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ఎంపిడిఒ సాయిమనోహర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు సమయానికి హాజరుకాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతి శాఖ అధికారి ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమంలో తప్పక ఉండాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజినీర్ రమణయ్య, ఎంఇఒ చాముండేశ్వరి, ఎఒ ఓబిరెడ్డి, ఎపిఎం సుదర్శన్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వరలక్ష్మి, ఎపిఒ ఆదెప్ప, ట్రాన్స్‌కో ఎఇ శివయ్య, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

హిందూపురం : రహదారి విస్తరణలో భాగంగా నష్టపోతున్న వారందరిని అన్ని విధాలా ఆదుకుంటామని ఎవరూ ఆధైర్య పడకూడదని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ బాధితులకు భరోసా ఇచ్చారు. వార్డు కౌన్సిలర్ మారుతీరెడ్డితో కలిసి 21వ వార్డు మోత్కుపల్లి ప్రాంతానికి చెందిన హిందూపురం నుంచి పరగి వరకు రహదారి విస్తరణ, డ్రైయినేజి నిర్మాణం వల్ల తమ ఇండ్లు కొల్పోతున్నామని 15 కుటుంబాలకు చెందిన బాధితులు ఎమ్మెల్సీని సోమవారం కలిశారు. స్పందించిన ఎమ్మెల్సీ ఏ ఒక్కరు ఆధైర్య పడకూడదని ప్రతి కుటుంబానికి ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌తో పాటు వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, బాధితులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ